# "ది ఫ్లవర్ వేజ్"

పరాత్పరరావుని అడిగింది అతని భార్య నందిని.

మీరు కథ నెలా రాస్తారు ?

"అకస్మాత్తుగా ఏమిటి ప్రశ్న?" అడిగాడు పరాత్పర రావు నవ్వుతూ.

చెప్పండి మీకు కథకు ప్లాటు ఎలా దొరుకుతుంది!

నే వ్రాసిన ఓ కథకి ఓ విధంగా దొరికింది.

నందిని ఆలోచనగా మౌనంగా ఉండిపోయింది.

ఎందుకొచ్చింది నీకీ సందేహం

"కథలు జీవితంలోంచి వస్తాయంటారు. నిజమేనా!

కొన్ని జీవితంలో జరిగిన సంఘటనలలోంచి కథలు అల్లటం రచయితలకు పరిపాటే.

మరి అలా వ్రాసిన కథలు వున్నాయా ?

'చాలా'

మళ్ళీ ఆలోచనగా మౌనంగా ఉండిపోయింది నందిని.

"చెప్పు ఇంకా ఏం సందేహాలున్నాయో"

"మీ కథల సంపుటి 'ఛాయలు' లోని పదమూడు కథలు అలా వ్రాసినవేనా ?

"అన్నీ కాదు, కొన్నే"

"ఏం కథలు"

"ఏం"

"ఊరికనే"

"నాకు టైమ్ అవుతోంది వడ్డిస్తావా?"

"అయినంతే అయిదే నిమిషాలు"

పరాత్పరరావు భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. కథల గురించి డైనింగ్ టేబుల్ దగ్గర మళ్ళీ ప్రస్తావించలేదు నందిని.

భర్త వెళ్ళిపోయాక వంటిల్లు సర్దుకొని పుస్తకాల రేక్ లోంచి అచ్చయిన పరాత్పరరావు 'కథల సంపుటి' తీసికొని మంచంమీద పడుకుంది.

ఆ పుస్తకం అచ్చయి రెండురోజుల క్రితమే వచ్చింది యింటికి పోస్టులో, అలాంటి పుస్తకాలు పాతిక వచ్చాయి. అయిదారు పరాత్పరరావు ఎవరెవరికో తీసుకెళ్ళి ఇచ్చాడు. ఇంకా కొన్ని పోస్టుకు పంపాలని చెప్పాడు. కొత్త పుస్తకం కాబట్టి ఇంకా 'ప్రింటింగ్' వాసన పోలేదు పుస్తకంనుంచి.

అందులోని మొదటికథ క్రిందటిరోజే చదివింది నందిని. ఆ తర్వాత కథ చదవకుండా చాలాసేపు ఆ కథ

గురించే ఆలోచిస్తూ ఉండిపోయింది. కథ పూర్తి అయ్యాక ఏదో అనుమానం తలెత్తింది నందిని మనసులో.

అందుకే ఆఫీసుకు వెళ్ళబోయేముందు భర్తని అన్ని ప్రశ్నలు వేసింది నందిని

ఆ కథల సంపుటిలోని మొదటి కథ పేరు 'ఆరాధన' కథంతా ఫస్ట్‌పర్సన్ రచయిత జరిగింది జరిగినట్లు చెప్పినట్లుగా సాగిపోతుంది. ప్రేమ కథ అది. అవ్యక్తమయిన ఇక ఆ కథ ప్రేమ కథ. సెంటిమెంటల్ ప్రేమ కథ. వ్రాయకుండా బ్రతకలేను అనుకొని రచయిత ఆ కథ వ్రాసినట్లుగా స్ఫురించే కథ అది. ఒకానొక అందమయిన అమ్మాయిని ఆమె అందం గుణం, మంచి మనసు చూసి, ఆమె అమితమైన పిచ్చితో ఆరాధించి, చివరికి ఆమెకి తన ప్రేమను వ్యక్తం చేయకుండా ఆమె నుంచి బలవత్తర కారణాల వల్ల దూరమయిన వ్యక్తి కథ అది.

ఆ కథలో హీరో పేరు ఎక్కడా సూచింపబడలేదు. హీరో తన నాన్న ఆఫీసరుగారి కూతుర్ని చూస్తాడు. వాళ్ళింటికి తండ్రి తీసుకెళ్ళినప్పుడు, ఆ అమ్మాయి మీద వ్యామోహం పెరుగుతుంది. అతనిలో తనకు తెలియకుండానే వారిద్దరి మధ్య పరిచయం స్వల్పమే అయినా, హీరోకి ఆ అమ్మాయి అంటే చెప్పలేనంత 'ఆరాధన' యిద్దరి మధ్యా వాళ్ళ ఆరునెలల పరిచయంలో జరిగిన సంభాషణ ఒకే ఒక పోస్టు కార్డు మీద వ్రాయగలిగేటంత తక్కువ.

ఆమెను చూడకుండా వుండలేనంత ప్రలోభానికి దిగ జారిపోతాడు హీరో. అయినా ఆత్మగౌరవం కాపాడుకో టానికి తనను తాను సంబాళించుకోటానికి ఎప్పుడూ విశ్వ ప్రయత్నం చేస్తుంటాడు. తామిద్దరి మధ్యా ప్రణయం అంకు రించి అది పరిచయం దాకా వెళ్ళటం అసాధ్యమని తెలుసు హీరోకి.

హీరో తండ్రి ఆఫీసుకి బదిలీ అయిపోతాడు. వాళ్ళు చాలా దూరప్రాంతానికి తరలి వెళ్ళిపోతారు. చివరిసారి ఏదో మిషతో ఆ అమ్మాయిని ఆఖరిసారి చూడటానికి వెళ్తాడు హీరో

తన మనసులో ఆమెమీద వున్న భావాన్ని అవ్యక్తం గానే వుంచి ఆమె గుర్తుగా ఏదయినా తీసుకొని జీవితాంతం దాచుకోవాలన్న కోరికతో ఎదురుగా టేబులుమీద వున్న "ఫ్లవర్ వాజ్"ని ఇవ్వమని కోరుతాడు.

"అదా ! ఎందుకు" అడిగింది ఆమె.

"బావుంది"

"మట్టిదే"

కాని పైన కుంచెతో వేసిన ఆ రాధాకృష్ణుల బొమ్మ అద్భుతంగా లేదా.

"ఇదివరకు అది అద్భుతంగా వుందనిపించలేదు. కాని మీరు చెప్పాక ఇప్పుడనిపిస్తోంది మీకు కావాలంటే తీసుకోండి".

"చూశారా గమ్మత్తు. మీరు చెప్పేదాకా అది మట్టిదని తెలియదు నాకు. పైన ఏదయినా రంగు పులిమితే లోపల ఏముందో తెలియదు"

"మీరు గమ్మత్తుగా మాట్లాడుతారు"

"కొన్ని కొన్ని పరిస్థితులలో మనకు తెలియకుండానే గమ్మత్తుగా మాట్లాడేస్తాం. గమ్మత్తేమిటంటే" అని ఎవరో చెప్పేదాకా గమ్మత్తుగా వున్నామని తెలియదు.

"మరి తీసుకోండి కావాలంటే"

"థాంక్స్. రోజూ పూలుపెట్టి పూజిస్తుంటాను మన గుర్తుగా"

"మళ్ళీ గమ్మత్తుగా"

"గమ్మత్తేమిటంటే గమ్మత్తు అర్థంకాదు" అలా ఫ్లవర్ వాజ్ ని తనతో తెచ్చుకుని దాన్ని ప్రాణప్రదంగా చూసుకుంటూ సెంటిమెంటల్ విలువలవల్ల.

కథ పూర్తిగా చదివింది నందిని మళ్ళీ.

ఇదివరకు ఏర్పడ్డ అనుమానం స్థిరపడింది నందినిలో.

లేచి గాజు తలుపులు తెరిచి ఫ్లవర్ వాజ్ ని అలమారులో నుంచి తీసి చూసింది.

అచ్చం ఆ కథలో వర్ణించిన తీరులోనే వుందది. తెల్లపు రంగుమీద నీలి రంగుతో పెయింటింగ్ చేయబడ్డ రాధా

కృష్ణుల విగ్రహం. అంచులకు పూయబడ్డ బంగారు రంగు నగిషి.

దాన్ని యథాస్థానంలో వుంచేసింది. తన భర్త పెళ్ళి గాక మునుపునుంచీ అది అతనితో వుంది. బ్రహ్మచారిగా వున్నప్పుడు వున్న సామానులో అదొకటి. ఇంత క్రితం పగలకుండా జాగ్రత్తగా దాన్ని ఎందుకు దాస్తున్నట్లు!

నిజంగా తన భర్త ఒకమ్మాయిని ఆరాధించి తన ప్రేమని తెలుసుకోలేక ఆ అమ్మాయిదగ్గరనుంచి ఆ ఫవర్ వాజ్ తీసుకొని దాన్ని భద్రంగా దాచుకుంటూ చివరికి వుండబట్టలేక యీ కథ రాశారా!

తనలో ఈర్ష్యవుందా! తమ పెళ్ళికి ముందు ఆయన వేరెవరినో ప్రేమించారని తెలిస్తే తనలో బాధ, అసూయా, ద్వేషం కలుగుతాయా!

బాధ లేదు. ద్వేషంకూడా లేదు. అసూయ కావచ్చు. తనకు కొత్తగా మొలకెత్తిన ఆ 'ఏదో' భావం, అసూయ ఎందుకయి వుండకూడదు.

కాని నందిని తన భర్తని నిగ్గదీసి అడగలేదు. అలా అడిగి ముఖాముఖీ తన అనుమానాన్ని తీర్చుకొనే మనస్తత్వం కాదామెది. కాని తన అనుమానం నివృత్తి చేసుకోకుండా వుండలేదు, సందిగ్ధంలో పడింది.

సాయంత్రం పరాత్పరరావు యింటికి తిరిగి వచ్చాడు ఆఫీసు నుండి.

"అలా వున్నావేం?" అడిగాడు నందినిని.

"ఏం లేదు" జవాబు చెప్పింది.

"మా జీవితంలో ఏదయినా మిమ్మల్ని కదిలించే బలవత్తరమయిన సంఘటన జరిగిందనుకోండి. అప్పుడు దాన్ని ఆధారంగా తీసుకొని కథ రాశారా?" అడిగింది రాత్రి పడుకోబోయే ముందు.

ఏమిటి యీ యింటర్వ్యూ పత్రికలాగా నవ్వాడు"

"చెప్పండి. పక్కింటి ఆవిడ అడిగితే నాకూ అదే అనుమానం వచ్చింది"

"రాయకుండా వుండలేను" పరాత్పరరావు చెప్పాక కాసేపాగి

"ఆ సంగతి ఆవిడకు చెప్పాను" అన్నది.

ఆ తరువాత మౌనంగా వుండిపోయింది నందిని

నందిని మౌనంగా కొత్తగా అనిపించింది పరాత్పర రావుకి అలిగినట్టుందా? రాత్రి పడుకోబోతూ 'ఛా' మామూలుగానే వున్నానే" అన్నది నందిని కొద్దిగా తత్తరపడి. తన మనసులోని సంఘర్షణ తన భర్తకి తెలియటం ఎంత మాత్రం ఇష్టం లేదు నందినికి. "కొత్త-థీం ఏదయినా మార్కెట్టులోకి వచ్చిందా?" పరిహాసం చేశాడు పరాత్పర రావు మర్నాడు మామూలుగానే వుంది నందిని.

భర్తకు భోజనం పెట్టి ఆఫీసుకు పంపాక కాసేపు రేడియో పెట్టి విన్నది ప్రోగ్రామ్ అయిపోగానే ఇల్లు వర్ద

టుంది. తరువాత ఏం చెయ్యాలో తెలియక ఒక పత్రిక తీసుకొని మంచంమీద పడుకుంది. చదవబుద్ధి కాలేదు

లేచి గాజు తలుపుల అల్మారాలోంచి పరాత్పరరావు కథల సంపుటి తీసి, మొదటి కథ 'ఆరాధన' మరోసారి చదివింది. దీర్ఘంగా నిట్టూర్చి దాన్ని మళ్ళీ అల్మారాలో పెట్టేసింది.

నందిని మనసంతా చిరాకుగా వున్నట్టు అనిపించింది. తలుపు తాళంవేసి ప్రక్కింటి పిన్నిగారిని తీసుకొని, ఉదయం ఆట సినిమాకు వెళ్ళింది దగ్గరలో నేవున్న సినిమాథియేటర్‌కు.

ఆ సినిమా కూడా ప్రేమకథే.

ఇంటికి రాగానే తలుపు పట్టుకొని లాగింది.

పరాత్పరరావు ఆఫీసునుంచి తిరిగి వచ్చాక మళ్ళీ అడిగాడు నందినిని, పరిశీలనగా చూసి.

“ఏమిటి ఒంట్లో బాగోలేదా ?”

నవ్వి వూరుకుంది నందిని.

పరాత్పరరావు గుర్తించాడు నందినిలోని మార్పు.

వాళ్ళిద్దరి మధ్యా అంతకు మునుపెన్నడూ లేని వింత నిశ్శబ్దం అలుముకుంది. పరాత్పరరావు కారణం కనుక్కొని పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చెయ్యలేదు.

మరునాడు నందిని భర్త కిష్టమయిన దొండకాయ కూర, ఉల్లిపాయల బంగాళా దుంప వేపుడు చేసింది. మామూలుగా అయిపోయింది నందిని.

అప్పుడు అడిగాడు పరాత్పరరావు "ఏమిటి ? మనసులోని బాధ నాకు చెప్తేతప్ప అర్థంగాదు నిన్న మొన్న ఎందుకిలా వున్నావు ?"

"ఏం లేదు" అన్నది నందిని మృదువుగా నవ్వి.

భర్త ఆఫీసుకు వెళ్ళాకా ఇంటి పనులన్నీ అయ్యాక తీరిక చిక్కింది నందినికి. వద్దనుకుంటూనే మనసుని కంట్రోలు చేసుకోలేక ఆ కథలసంపుటితీసి పడకకుర్చీలో కూర్చుంది. ఆ మొదటి కథ తప్ప మిగతా పన్నెండు కథలూ చదువుదామనుకుంది. కాని ఆ మొదటి కథే మొదలుపెట్టింది మళ్ళీ.

కథ పూర్తి అయ్యాక దీర్ఘంగా నిట్టూర్చి చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయింది. పరాత్పరరావు ఆఫీసుకు ఫోన్ చేసి ఆ కథ సంగతి, తన అనుమానం సంగతి అడుగుదామనుకున్న కోర్కెను బలవంతంగా నిగ్రహించుకుంది.

దాదాపు అరగంట సేపు ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. గాజుతలుపులోంచి కనబడుతున్న 'ఫ్లవర్ వాజ్' ని చూస్తూ.

సాయంత్రం పరాత్పరరావు ఆఫీసునుంచి తిరిగి వచ్చాడు నందిని మూడ్ ఎలా వుంటుందో అని మనసులో కొద్దిగా భయపడుతూనే.

చిరునవ్వుతో పలకరించింది నందిని పరాత్పరరావు కాఫీ తాగాక చెప్పింది.

"మరేం అనుకోనంటే ఒకటి చెప్తాను"

"ఒకటి కాదు. వంద చెప్పు"

"కోపం తెచ్చుకోరుగా"

"ఊహూ"

"నమస్తుంటే పొరపాటున ఆ రాధాకృష్ణుల బొమ్మ వున్న ఫ్లవర్ వేజ్ చేయిజారి క్రిందపడి పగిలిపోయింది.

"పరాత్పరరావు భార్యకళ్ళలోకి చూశాడు. నందిని కూడా భర్త కళ్ళల్లోకి చూసింది అతని భావాల్ని పసికట్టాలనే వుద్దేశం తో

చిన్నగా నవ్వాడు పరాత్పరరావు.

"మంచిది ఇంకోటి కొందాంలే" అన్నాడు.

పెద్దగా నిట్టూర్చింది నందిని. భుజంమ్మీద నుంచి కొండంత భారం తగ్గినట్లుగా.

"మీరు కోప్పడతారని భయపడిచస్తున్నాను. అదేం భాగ్యమా బంగారమా కోప్పడటానికి రెండుం పావలాపెట్టి కొన్నాను, మెరీనా బీచ్ లో మద్రాస్‌లో వున్నప్పుడు.

మీరు బీరువాలో 5 ఏళ్ళ నుండి దాచుకుంటున్నారుగా అనవసరంగా పగలగొట్టానని బాధేసింది.

"యీసారి బజారుకి వెళ్ళినప్పుడు మంచిది కొందాం.

"పరాత్పరరావులో ఎట్టి మార్పూ లేదు. మామూలుగా వున్నాడు. నందిని అనవసరంగా భర్తని ఒక కథ పట్టుకొని అనుమానించినందుకు సిగ్గుపడింది తొందరపడి తను అడిగేయలేదు అనవసరంగా బయటపడిపోయేది.

వెనక ఫ్లవర్ వేజ్‌ని కావాలని పగలగొట్టింది. తన కోపం పట్టలేక. కానీ అనవసరంగా పిచ్చిపిచ్చిగా వూహించుకొని పగలగొట్టింది.

* * *

ఆ రోజు రాత్రి పరాత్పరరావు యింటి వెనక వున్న చెత్తడబ్బాలోంచి పగిలిపోయిన ఆ ఫ్లవర్ వేజ్ ముక్కలన్నీ జాగ్రత్తగా వెతికి ఏరి ఒక పొడుగాటి కవరులో వేసుకున్నాడు. మర్నాడు ఆఫీసుకు వెల్తూ భార్య చూడకుండా ఆ కవరుని ఆఫీసుకు తీసుకువెళ్ళి తన టేబిల్ డ్రాయరులో దాచుకున్నాడా కవరుని భద్రంగా, ఆప్యాయంగా.

—X—